సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



హ్యాపీ బర్త్‌డే కలెక్టర్..

పెద్దపల్లిరూరల్: కలెక్టర్ సంగీత జన్మదినం సందర్భంగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.



కేటీఆర్ పర్యటనపై సమీక్ష

గోదావరిఖని: మంత్రి కేటీఆర్ పర్యటనపై సింగరేణి ఇల్లెందు క్లబ్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సింగరేణి, మున్సిపల్ అధికారులతో కలిసి సమీక్షించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంపై చర్చించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గవర్నర్ దృష్టికి ఆర్‌ఎఫ్‌సీఎల్ కుంభకోణం



గవర్నర్ తమిళిసైని కలిసిన బీజేవైఎం నాయకులు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ కొందరు వ్యక్తులు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బద్రి దేవేందర్ పటేల్, శివంగారి సతీష్ గవర్నర్ తమిళిసై దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఇక్కడి పారిశ్రామిక ప్రాంత సమస్యలను విన్నవించారు. సింగరేణిలో చాలామంది మారు పేర్లతో పనిచేస్తున్నారని, పరిష్కారం చూపాలని కోరారు. గ్రూప్–1 పేపర్ లీకేజీలతో నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నాయకలు రాష్ట్ర మెడికల్ సెల్ కో–కన్వీనర్ పడాల ప్రియదర్శిని, రామగిరి అఖిల్‌కుమార్ ఉన్నారు.

చిన్న పంచాయతీలతోనే అభివృద్ధి



పన్నూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: చిన్న గ్రామ పంచాయతీలతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి రాగానే చిన్నచిన్న తండాలు, గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రామగిరి మండలం పన్నూర్‌లో సుమారు రూ.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, శ్మశాన వాటిక, సెంట్రల్ లైటింగ్, సీసీ కెమెరాలను సర్పంచ్ అల్లం పద్మతో కలిసి శనివారం ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో సింగరేణి నిధులను ప్రభావిత గ్రామాలకు పూర్తిస్థాయిలో కేటాయిస్తుండడంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, కమాన్‌పూర్ ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు దాసరి రాయలింగు, ఇనగంటి భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శేంకేశి రవీందర్, నాయకులు పూదరి సత్యనారాయణ, అల్లం తిరుపతి, మ్యాదరబోయిన కుమార్ పాల్గొన్నారు.

హోంశాఖ ఏజీపీగా సాయిరాం మున్నా



ధర్మారం: మండలంలోని నందిమేడారానికి చెందిన పూసాల సాయిరాం మున్నా హైకోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేస్తున్న సాయిరాం హోంశాఖ ఏజీపీగా బదిలీ అయ్యారు. హైకోర్టులో ఉన్నత విద్య వ్యవహారాలు చూస్తున్న సాయిరాం తక్కువ సమయంలోనే తన ప్రొఫెషన్‌లో పరిణతి సాధించటం.. డెడికేషన్‌ను గమనించిన ఉన్నత అధికారుల బృందం ఈ అవకాశం కల్పించింది. సవాళ్లతో కూడుకున్న హోంశాఖలో ఏజీపీగా తనకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

శాంతియుత దీక్ష చేసుకోనివ్వరా..?



మాట్లాడుతున్న ముత్యంరావు తదితరులు

పెద్దపల్లిరూరల్: బీసీల గణన చేపట్టాలని, రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్‌తో శాంతియుతంగా చేస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని దొంగల్లా అర్ధరాత్రి కూల్చడమేంటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రశ్నించారు. బస్టాండ్ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం బీఎస్పీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హక్కులకోసం శాంతియుతంగా నిరసన తెలిపే అవకాశం లేదా.. ? అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో ఉద్యమాలు ఆగవని, మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. నాయకులు చంద్రశేఖర్, శేషాద్రి, శారద, తాండ్ర అంజయ్య, లక్ష్మయ్య, వరలక్ష్మి, నర్సయ్య, నరేశ్ తదితరులున్నారు.

'జగిత్యాల' మామిడి

వేసవి సీజన్ పండు మామిడి. తినేందుకు, పచ్చడికి మామిడిని వాడుతుంటారు. బంగినపల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫల రాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. మామిడి ఎగుమతికి జగిత్యాల కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. నాణ్యత, రుచి ఉండడంతో కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతోంది.

– వివరాలు 6లో...



పొలిటికల్ హీట్..!



పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పార్టీలో చేర్చుకుంటున్న బీజేపీ నాయకులు

- ఎలక్షన్ మూడ్‌లో నేతలు, పార్టీలు
- సమ్మర్‌ను తలదన్నేలా పెరిగిన రాజకీయ వేడి
- భట్టి పాదయాత్రతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- రామగుండం బీఆర్‌ఎస్‌లో ఆశావహుల హల్చల్
- పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు



ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వేసవి తాపానికి మించి పొలిటికల్ హీట్ పెరిగిపోతోంది. అన్ని పార్టీలు, నాయకులు ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్లారు. ఈ ఏడాది చివరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరాలని, ఆ దిశగా అడుగులే కాదు.. పరుగూ పెడుతున్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాజకీయ ముఖచిత్రంలో తాము ఉండేలా పావులు కదుపుతున్నారు. అధికార, విపక్ష అభ్యర్థులు పైచేయి సాధించడానికి వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ విషయంలో ఒక్కో అభ్యర్థి ఒక్కో పంథాను అనుసరిస్తున్నారు. ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సీట్లు, టికెట్లను పదిలపర్చుకునే పనిలో సిట్టింగ్‌లు.. భవిష్యత్‌కు బాటలు వేసుకునే పనిలో ఆశావహులు నిమగ్నమయ్యారు.

'పీపుల్స్‌మార్చ్'తో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. ఐదు రోజులపాటు జిల్లాలో పాదయాత్ర కొనసాగించడంతో శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ముఖ్యంగా జిల్లాలో కాంగ్రెస్‌కు పట్టు సడలలేదని, కలిసికట్టుగా పోరాడితే ఫలితం ఉంటుందనే భావన ఆ పార్టీ నేతలు, శ్రేణుల్లో కలిగింది. భట్టి వెంట నడిచేందుకు స్వచ్ఛందంగా తరలివచ్చిన శ్రేణులను చూసి నేతల్లో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును శాసనసభ ఎన్నికల నాటికి పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, అంకితభావంతో పనిచేసి తటస్థంగా ఉన్న పాత శ్రేణులను గుర్తించి తిరిగి పార్టీలో చేర్చుకోవాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలే కాకుండా స్థానికంగా ఉన్న ధరణి, చివరి ఆయకట్టు, సింగరేణిలోని స్థానికులకు ఉద్యోగాలు, రైతు రుణమాఫీ, అసంపూర్తి ప్రాజెక్టులు, నిరుద్యోగ సమస్యలు, ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల గోడు, ఇసుక, మట్టి, బూడిద మాఫియా అరాచకాల అజెండాతో ముందుకెళ్తే బాగుంటుందనే ఆలోచనను కలిగించింది. భట్టి పాదయాత్రతో ప్రజల్లో ఆదరణతోపాటు పార్టీలో ఉన్న వర్గపోరు కూడా బహిర్గతమైంది. ప్రజల్లో ఉన్న ఆదరణను సొమ్ము చేసుకోవాల్సిన నేతలు.. గ్రూప్ రాజకీయాలతో బలహీనపరుస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోటాపోటీగా కార్యక్రమాలు..

జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో చాలామంది ఆశావహులు తాము అసెంబ్లీ ఎన్నికల రేసులో ఉన్నామని చాటేందుకు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ శ్రేణులతో మమేకమవుతున్నారు. కాంగ్రెస్ నేతలు శ్రీధర్ బాబు, మక్కాన్ సింగ్, విజయరమణారావు హాథ్ సే హాథ్ కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు అధిష్టానం కొత్తగా జిల్లా అధ్యక్షుడిగా రావుల రాజేందర్‌ను నియమించింది. దీంతో సదరు జిల్లా అధ్యక్షుడు మూడు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ నేతల మధ్య ఐక్యతకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపల్లి బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న బొద్దుల లక్ష్మణ్, నల్లా మనోహర్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష కూడా వివిధ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు.

ఆశావహుల హల్‌చల్..

ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికలపై రామగుండంలో ఇప్పుడే వేడి రాజుకుంది. సిట్టింగ్‌లకే సీటు అని ఇటీవల కేసీఆర్ ప్రకటనతో సీటు పదిలపర్చుకునేందుకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆత్మీయ సమ్మేళనాలు, వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే జిల్లాలో మరెక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఇలాఖాలోనే ఆశావహులు బహిరంగంగా తామే ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారు. వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసమ్మతి నేతలతో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అసంతృప్తులను పిలిపించి సముదాయించాలని చూశారు. కానీ.. ఆయన ముందే చందర్ తప్ప తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఫర్వాలేదని తేల్చిచెప్పారు. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది. మరోవైపు అసంతృప్తులందరూ ఐక్యంగా ఉన్నట్లు తెలియజేసేందుకు మరో ఆశావహుడు కోలేటి దామోదర్ కలిశారు. అనంతరం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను సంప్రదించడం రామగుండంలో హాట్‌టాపిక్‌గా మారింది.

సాక్షి ఆధ్వర్యంలో కరాటే శిక్షణ



కరాటే నేర్చుకుంటున్న చిన్నారులు

జ్యోతినగర్: వేసవి సెలవుల దృష్ట్యా 'సాక్షి' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి విద్యాసంస్థల సహకారంతో విశ్వభారతి హైస్కూల్ ఆవరణలో కరాటేలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. మే 1 నుంచి 3 వరకు ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు శిక్షణ ఉంటుంది. 6 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలు శిక్షణ పొందవచ్చు. సెల్ఫ్ డిఫెన్స్, డిసిప్లెయిన్, రెస్పెక్ట్, కో–ఆర్డినేషన్, కాన్ఫిడెన్స్, ఫిట్‌నెస్, సేఫ్టీ, లాయల్టీ, హానర్‌కు సంబంధించిన అంశాలు నేర్పిస్తారు. వివరాలకు విశ్వభారతి విద్యాసంస్థల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ 97007 45078, 'సాక్షి' జ్యోతినగర్ రిపోర్టర్ 94949 85525 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మక్కాన్‌సింగ్

ఫెర్టిలైజర్‌సిటీ: వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. పాలకుర్తి మండలం గుంటూరుపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు గుండు లక్ష్మణ్, బుర్ర శ్రీనివాస్, కిట్టు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ పరీక్ష

చొప్పదండి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జవహర్ నవోదయలో ఆరో తరగతి అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు 7,730 మంది దరఖాస్తు చేసుకోగా, 6,845 మంది హాజరయ్యారని విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.

ధాన్యం కొనాలని రైతుల ఆందోళన



సుల్తానాబాద్ రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- పోలీసుల జోక్యంతో విరమణ
- ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలవడానికి వెళ్లిన రైతులు

సుల్తానాబాద్: ధాన్యం కొనుగోలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు సుల్తానాబాద్‌లో రాజీవ్ రహదారిపై శనివారం ఆందోళనకు దిగారు. తేమశాతం వచ్చినా.. తాలు ఉందంటూ తూకం వేయడం లేదన్నారు. నాలుగురోజులుగా వర్షం కురుస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందుగా మండలంలోని కదంబాపూర్ రైతులు ట్రాక్టర్లతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రైతు నల్లవెల్లి మధురయ్య విక్రయించిన ధాన్యంలో క్వింటాల్‌కు రెండు కిలోలు కోత విధించారని, నిర్వాహకులకు తెలిసే ఇదంతా జరుగుతోందని పేర్కొన్నారు. తమ గ్రామ పరిధిలో 10 రైస్‌మిల్లులు ఉన్నాయని, వాటిలో ధాన్యం కొనేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. సుమారు మూడు గంటలపాటు ఆందోళనకు దిగడంతో ఈ విషయాన్ని తహసీల్దార్ యాకన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కాంటావేస్తున్నామని ఆయన చెప్పడంతో రైతులు ఆగ్రహంతో రాజీవ్ రహదారిపైకి చేరుకుని రాస్తారోకో చేశారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. రైతులకు సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కడారి సునీల్, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ పటేల్ సంఘీభావం ప్రకటించారు. రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు గోసుకల సదయ్య, గట్టయ్య, శంకర్, తిరుపతి, లక్ష్మయ్య, సంపత్, లచ్చయ్య, ఓదెలు, కొమురయ్య, కనకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ వద్దకు రైతులు..

పోలీసులు రాస్తారోకో విరమింపజేసిన అనంతరం రైతులు ట్రాక్టర్లలో జిల్లాకేంద్రానికి బయల్దేరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించామని రైతులు పేర్కొనగా.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైతు సమస్యల పరిష్కారానికి న్యాయ సలహా కేంద్రాలు



మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్

ఓదెల: రైతు సమస్యల పరిష్కారానికి వ్యవసాయ న్యాయసలహా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక రైతు వేదికలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. పంటల విధానంలో సమస్య తలెత్తినా.. నకిలీ విత్తనాలు, క్రిమిసంహారకాలు అమ్మినా తమను సంప్రదించాలన్నారు. ఓదెలలో కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు. సర్పంచు ఆకుల మహేందర్, ఎంపీపీ కునారపు రేణుకదేవి, మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి, సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక,డీఏవో ఆదిరెడ్డి, తహసీల్దార్ రమేశ్, ఈవో పాల్గొన్నారు.

గుట్టుగా గుట్కా దందా..!

- విచ్చలవిడిగా అమ్మకాలు
- అక్రమార్కులు ఆడిందే ఆట
- పొరుగు జిల్లాల నుంచి దిగుమతి
- రూ.కోట్లలో సాగుతున్న వ్యాపారం
- పట్టించుకోని జిల్లా అధికారులు



పాన్‌మసాల, గుట్కాలు

సుల్తానాబాద్: నిషేధిత పొగాకు ఉత్పత్తులు గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలోని ప్రతిపల్లెకూ చేరుతున్నాయి. దందా చేసేవారు రూ.లక్షల్లో సంపాదిస్తుంటే.. వీటికి అలవాటైన వారు ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. పొరుగు జిల్లాల నుంచి విచ్చలవిడిగా సరఫరా అవుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి..

పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లా నుంచి గుట్కాలను జిల్లాకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ జిల్లాలోని చెన్నూర్, తదితర ప్రాంతాల నుంచి గుట్కా, అంబార్ ప్యాకెట్లు తెప్పించి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాళేశ్వరం, కాటారం, మహదేవపూర్, మల్హార్, మహాముత్తారంలోని గ్రామాలకు గోదావరిపై వంతెనల మీదుగా కార్లు, ద్విచక్రవాహనాలలో ఎవరికీ అనుమానం రాకుండా సునాయసంగా తరలిస్తున్నారు. ఆ సరుకును వేకువజామున 3 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు బైకులపై వెళ్తూ దుకాణాలకు చేరవేస్తున్నారని సమాచారం.

కోట్లలో వ్యాపారం..

గుట్కా వ్యాపారం కోట్లలో సాగుతోంది. ఎన్నిసార్లు దొరికినా కొందరి తీరు మారడం లేదు. కొందరు బడావ్యాపారులు ఈ దందానే తమ జీవనోపాధిగా మార్చుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు మాత్రం ప్రధాన సూత్రధారులను కాకుండా వీరి నుంచి కొనుగోలు చేసేవారినే పట్టుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నిఘా..

ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా గుట్కా విక్రయించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లో ఎవరెవరు ఈ దందాకు పాల్పడుతున్నారనే వివరాలను సేకరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో గుట్కాలను తరలిస్తూ పోలీసులకు పలువురు పట్టుబడ్డారు. మరికొన్ని చోట్ల టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసులు దాడులు చేసి గుట్కాలను స్వాధీనం చేసుకుంటున్నారు.

అధికారులు చర్య తీసుకోవాలి



గుట్కా, అంబర్ పాన్, మసాలాలను సరఫరా చేసే వారితోపాటు అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. దీనివల్ల క్యాన్సర్ వచ్చే అవకాశముంది. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని రవాణాకు అడ్డుకట్ట వేయాలి. – సంకేనపల్లి లక్ష్మణ్, అంబేడ్కర్ సంఘం నాయకులు సుల్తానాబాద్

చర్యలు తీసుకుంటాం



గుట్కా, పాన్‌మసాలాలు అమ్మినా.. అక్రమంగా రవాణా చేసినా చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణా, నిల్వలు చేసిన వారిపై సమాచారం ఇస్తే ప్రోత్సాహక బహుమతి అందజేస్తాం.

– ఇంద్రసేనారెడ్డి, సీఐ, సుల్తానాబాద్

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



దీక్షాశిబిరాన్ని సందర్శించి సంతకం చేస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో కార్యదర్శులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దుర్మార్గపు పాలనను సాగిస్తున్నారని, ఉద్యోగులకు సమయానికి జీతాలివ్వడం లేదని పేర్కొన్నారు. ఆ ఆవేదనతో కొంతమంది కార్యదర్శులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకులు మల్లయ్య, సంపత్, శ్రీమాన్, కుమార్, శ్రీనివాస్, సత్యం, రవీందర్, జగదీశ్, అవినాష్, సునిల్, మహేశ్, కాజ, కిష్టయ్య, సంతోష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

- వచ్చేనెల 10, 11, తేదీల్లో ఉత్సవాలు
- పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోలేటి దామోదర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో స్వయంభూగా వెలసిన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో మే 10, 11, 12 తేదీల్లో శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. ఈ ఉత్సవ పోస్టర్‌ను శనివారం జగద్గురు పుష్పగిరి పీఠాధిపతి శంకరాచార్య శ్రీవిద్యాశంకరభారతీస్వామి చేతులమీదుగా హైదరాబాద్ బేగంపేటలోని ఆశ్రమంలో ఆవిష్కరించారు. నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కమాన్‌పూర్: రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా నూనె గింజల సాగుపై దృష్టి సారించాలని రామగిరి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్వచర్లలో శనివారం వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ సీడ్స్ కార్యక్రమంలో భాగంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి వేరుశనగ, ఆయిల్ పాం సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీ ఇస్తోందని పేర్కొన్నారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సర్పంచ్‌లు గంట పద్మ, ఎండీ.మజూర్, ఎంపీటీసీ కొట్టె సందీప్, ఏవో భూక్య మోహన్, ఏఈవో అరవింద్ ఉన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం: ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముచ్చెర్ల బక్కయ్య(52) ప్రమాదవశాత్తు శనివారం ఉదయం వ్యవసాయబావిలో పడి మరణించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బక్కయ్య కొంతకాలంగా కొత్తపల్లిలో ఉంటూ సమీప గ్రామం బొమ్మారెడ్డిపల్లి మామిడితోటలో పనిచేస్తున్నాడు. అయితే తోటకు పనికి వెళ్లిన బక్కయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించినట్లు మృతుడి అల్లుడు ఎలుక రాజయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘జగిత్యాల’ మామిడి

- మామిడి ఎగుమతికి కేరాఫ్ జగిత్యాల
- ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్
- నాణ్యత, రుచితో కొనుగోలుకు వ్యాపారుల పోటీ
- ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200కోట్ల వ్యాపారం

జగిత్యాలఅగ్రికల్చర్: బంగిన్‌పల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. దేశవిదేశాల్లో ఎక్కడున్నా.. సీజన్‌లో జగిత్యాల నుంచి వచ్చిన మామిడిపండును రుచిచూడక మానరు. జగిత్యాల మామిడికి రుచి, పరిమాణంలో ప్రత్యేకత ఉంటుంది. అందుకే దేశంలోని అన్ని రాష్ట్రాలకు, విదేశాలకు సీజన్‌లో టన్నుల కొద్ది మామిడికాయ ఎగుమతి అవుతుంది. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతుంది.

సండే స్పెషల్



లారీల్లో తరలిస్తున్న మామిడికాయలు

వైఎస్సార్ ఏర్పాటు చేసిన మార్కెట్

మొన్నటి వరకు కల్లోల ప్రాంతంగా ముద్రపడిన జగిత్యాల నేడు మామిడి రుచులతో దేశ,విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి ప్రోద్బలంతో జగిత్యాలలో రాజీవ్‌గాంధీ మామిడి మార్కెట్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం మామిడి మార్కెట్లలో వసతులు కల్పిస్తుండడంతో మరింత డిమాండ్ ఏర్పడింది. జగిత్యాల మామిడి మార్కెట్‌తో పాటు మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి ఏటా రూ.200కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది.



మామిడికాయలను ప్లాస్టిక్ ట్రేలో నింపుతున్న కూలీలు

ఈసారి తగ్గిన దిగుబడి..

రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా ఢిల్లీవరకు మామిడి ఎగుమతి అయ్యింది. మార్కెట్లోని 88మంది కమీషన్ ఏజెంట్లు ఇతరరాష్ట్రాల వ్యాపారులకు మామిడిని పంపిస్తుంటారు. ఈ ఏడాది మామిడికాయకు మంగు ఏర్పడటం, కాయలు తక్కువగా ఉండటంతో వ్యాపారం కాస్త తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తీర్ణం ఉండగా, కనీసం 1.50లక్షల మెట్రిక్ టన్నుల మామిడికాయ రావాల్సిఉండగా.. పంటనష్టంతో సగం దిగుబడే వచ్చే అవకాశముంది.

జగిత్యాల మామిడికి గిరాకీ ఎందుకంటే ?

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నూజివీడు, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, తిరుపతి, జగిత్యాలలో మామిడి మార్కెట్లు ఉన్నాయి. దేశం మొత్తం దిగుబడుల్లో సగంవాటా రెండు తెలుగు రాష్ట్రాలదే. ఇందులో 10–15శాతం వాటా జగిత్యాల మామిడిదే ఉంటుంది. ఈ ప్రాంతంలోని ఎర్రనేలలు మామిడిపంటకు అనుకూలమైనవి. కాయ రంగు, రుచి బాగుంటుంది. నీటివసతి కారణంగా పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఇక్కడి మామిడికాయలు రవాణాలో డ్యామేజీ కావు. ఎన్నిరోజులైనా కాయ నాణ్యతగా ఉంటుంది. ఢిల్లీ వంటి మార్కెట్లలో జగిత్యాల కాయరాగానే వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడుతుంటారు. రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా జగిత్యాల నుంచి దాదాపు 3–4 వేల మెట్రిక్ టన్నుల మామిడికాయ ఢిల్లీకి ఎగుమతైంది.

మంచి రుచితో విదేశాలకు

జగిత్యాల జిల్లాలో 50వేల ఎకరాలు, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లో మరో 30వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. బంగిన్‌పల్లి, హిమాయత్, దశేరీ రకాలనే ఇక్కడి రైతులు సాగు చేస్తుంటారు. కాయలను నైపుణ్యం గల ఇతర రాష్ట్రాల కార్మికులు గ్రేడింగ్ చేసి, ఢిల్లీకి పంపిస్తున్నారు. అక్కడి ఎగుమతి వ్యాపారులు గల్ఫ్‌దేశాలైన దుబాయ్, ఖతర్, మస్కట్, సౌదీ, బహ్రెయిన్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్, నేపాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, జమ్ము కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, వారాణాసీ, అలహాబాద్, ఛండీఘర్, నాగ్‌పూర్, నాసిక్, ముంబై, చంద్రపూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు ఇక్కడి సరుకు ఎగుమతి అవుతుంది. దశేరి రకం హైదరాబాద్, బెంగళూర్, ముంబయి వంటి మెట్రోసిటీలకు ఎగుమతవుతోంది.

రైతుకు లాభం అంతంతే..

ఈ పంటసాగులో రైతులకు లాభం అంతంతే. ఓపెన్ మార్కెట్ లేకపోవడం, కమీషన్ ప్రతిపాదినక వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రేటు పెట్టి కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులదే పైచేయి అవుతోంది. రాటన్, సూట్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు నేరుగా నాగ్‌పూర్ మార్కెట్‌కు కాయలు తీసుకెళ్తున్నారు.

ధర లేదు



ఏటా మామిడికాయలను మార్కెట్‌కు తీసుకువస్తున్నప్పటికీ సరైన ధరరావడం లేదు. జిల్లా అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనబడటం లేదు. ఈ ఏడాది ఓ వైపు రేటు రాకపోవడమే కాకుండా, మరోవైపు కాయకు మంగు వచ్చి నల్లగా మారాయి. అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి.

– రవీందర్‌రెడ్డి, రైతు, రాయికల్

జగిత్యాల కాయకు డిమాండ్



జగిత్యాలకాయకు అన్ని రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ వ్యాపారులు కొనుగోలు చేసిన కాయ ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి విదేశాలకు వెళ్తుంది. జగిత్యాలకు చెందిన కాయ తాజాగా, పరిమాణంలో పెద్దగా కనబడటంతో చాలామంది కొనుగోలు చేస్తుంటారు.

– ఎండీ మోయిన్, మామిడి వ్యాపారి, జగిత్యాల

జగిత్యాల మామిడి బ్రాండ్



జగిత్యాల మామిడి అంటేనే ఓ బ్రాండ్. నాణ్యతతో పాటు రుచిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జగిత్యాల మామిడి మార్కెట్‌ను తెలంగాణలోనే ఓ మోడల్ మామిడి మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నాం. అదనంగా 10 ఎకరాల స్థలం మామిడి మార్కెట్‌కు తీసుకోవడంతో పాటు రూ.7 కోట్లతో షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– నక్కల రాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

డిమాండ్ ఉంది



జిల్లాలో 50 వేల ఎకరాల వరకు, చుట్టుపక్కల జిల్లాలో మరో 30వేల ఎకరాల వరకు మామిడి సాగవుతోంది. ఇక్కడి కాయకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. రంగు, రుచితో పాటు ఎన్ని రోజులు రవాణా చేసినా చెడిపోదు అనే పేరుంది. మామిడికి ఉన్న డిమాండ్, వడగాల్పుల దృష్ట్యా కాయ ముదరక ముందే తెంపి, ఇతర రాష్ట్రాలకు పంపించడంతో ముక్కిపోతుంది.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలి



పరేడ్ పరిశీలిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ

గోదావరిఖని: పోలీసులు విధినిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని ఏఆర్ అడిషన్ డీసీపీ రియాజ్‌హుల్‌హక్ పేర్కొన్నారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో గోదావరిఖని సబ్ డివిజన్ సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించి ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సీపీఆర్ చేసే విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రమాదఘటనల్లో ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ ప్రక్రియ కీలకంగా పని చేస్తుందన్నారు. ఈ విధానంపై పోలీస్ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌రావు, ఆర్‌ఐలు మధూకర్, శ్రీధర్, అనిల్, డాక్టర్ తిరుమల, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్యాంపస్ టు కార్పొరేట్ కనెక్ట్



టాస్క్ రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్‌తో డైరెక్టర్, ప్రిన్సిపల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్ టు కార్పొరేట్ కనెక్ట్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. టాస్క్ రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిభానైపుణ్యాలను పెంపొందించుకుంటేనే కంపెనీల్లో ఉద్యోగావకాశాలను దక్కించుకోవచ్చన్నారు. కళాశాలలో సెమినార్లు, వర్క్‌షాపులు సాఫ్ట్‌వేర్ కార్పొరేట్ కంపనీ విజిట్స్ అందిస్తున్నామని డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ మణిగణేశ్ తెలిపారు. ఏవో సురేశ్, రాజిరెడ్డి, కోఆర్డినేటర్లు కౌసల్య, కృష్ణయ్య, స్వాతి, మధుశేఖర్, నటరాజన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లోని పూసాల రోడ్డు వద్ద గల రాజీవ్ రహదారిపై శనివారం డీసీఎం వ్యాన్, ఆటో ఢీకొన్న సంఘటనలో పెద్దపల్లి మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన ఆటోడ్రైవర్ మహంకాళి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఉపేందర్‌రావు కథనం ప్రకారం పెద్దపల్లి వైపు వెళ్తున్న ఆటోకు ద్విచక్రవాహనం అడ్డురావడంతో ఒక పక్కకు తిప్పాడు. దీంతో ఆటో వెనుకే వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



డీఆర్‌డీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. శనివారం సంఘం నాయకులతో కలిసి డీఆర్‌డీఓ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 18ఏళ్లుగా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు ధాన్యం కొనుగోళ్లలోనూ కీలకపాత్రను పోషిస్తున్నారని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. పదిరోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వీఓఏలు సమ్మెలో ఉన్నారని యూనియన్ నాయకత్వంతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రాజశ్రీ, రజిత, స్వప్న, ప్రేమలత, రాజేశ్వరి, రవి, స్వరూప, స్వప్న తదితరులున్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్’ పకడ్బందీగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పల్లె ప్రాంతాల్లో స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్– 2023 ధ్రువీకరణ పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సంగీత అన్నారు. స్వచ్ఛసర్వేక్షన్‌పై శనివారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి సమీక్షించారు. కేంద్రప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలను జిల్లాలోని ప్రతిగ్రామంలో పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర బృందాలు ఆకస్మిక తనిఖీలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రతి విభాగం నుంచి ఐదుగ్రామాలను మండల, జిల్లాస్థాయిలో ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘భారత్ బచావో’లో భాగస్వాములమవుదాం..



సమావేశంలో మాట్లాడుతున్న గాదె ఇన్నయ్య

పెద్దపల్లిరూరల్: భారత్ బచావో.. దీనికి జెండా లేదు. మనువాదాన్ని తరిమికొట్టడమొక్కటే ఎజెండా.. ఇందుకోసం అందరం ఏకం అవుదామని భారత్‌బచావో జాతీయ కమిటీ సభ్యుడు గాదె ఇన్నయ్య అన్నారు. మండలంలోని పెద్దకల్వలలో శనివారం భారత్‌బచావో సదస్సులో ప్రజాసంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులతో కలిసి మాట్లాడారు. మనుస్మృతిని వ్యతిరేకించాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. భూమిలో ఏ పంట సాగు చేయాలో వారే నిర్ణయించే పరిస్థితులు వచ్చాయన్నారు. దేశాన్ని కాపాడుకునేందుకే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలోని హిందుత్వ మనువాదాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, బీఎస్పీ నాయకులు దాసరి ఉష, పద్మ, హనుమయ్య హాజరయ్యారు. ప్రజాసంఘాల నాయకులు మాదన కుమారస్వామి, బాలసాని రాజయ్య, జైసింగ్ రాథోడ్, గోపు సమ్మన్న, ముడిమడుగుల మల్లన్న పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: సినిమా థియేటర్‌లో పనిచేసేవారికి అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకునేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పెద్దపల్లిలోని శ్రీనివాస థియేటర్‌లో అగ్నిప్రమాద నివారణకు అవసరమైన పరికరాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. సినిమాహాళ్లు, ఆసుపత్రులు, పాఠశాలల్లో అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలను అందుబాటులో ఉంచుకుని ఆయా పరికరాల వినియోగంతో ప్రమాదాలను నియంత్రించాలన్నారు. సిబ్బంది సిరాజుద్దిన్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

విరమణ పొందిన అధికారులకు సన్మానం



రాంమూర్తిని సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని ఎస్టేట్స్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఊట్కూరి రాంమూర్తి, పర్యావరణ పరిరక్షణ అధికారి ఎంఏ.షఫీ శనివారం ఉద్యోగ విరమణ పొందగా.. జీఎం కార్యాలయంలో ఆర్జీ–3 జీఎం, వెంకటేశ్వర్‌రావు, ఏపీఏ ఇన్‌చార్జి జీఎం డీ.బైద్య అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. సంస్థలో 36 ఏళ్లుగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించి క్రమశిక్షణతో మన్ననలు పొందారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు ఎలీషా, రఘుపతి, శ్రీనివాసులు, జైనులబద్దిన్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, రాజేశ్వరి, శ్యామల, పర్ష బక్కయ్య, దేవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు రక్షిత తాగునీరందించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు రక్షిత మంచినీటిని అందించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గుక్కెడు మంచినీటి కోసం కార్మికులు రోడ్లమీదకు వచ్చే పరిస్థితికి చేరిందన్నారు. గతంలో తమ యూనియన్ చేసిన వరుస పోరాటాల ఫలితంగా రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ సిస్టమ్స్ నిర్మాణం, సరఫరాకి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున తక్షణ చర్యల కింద కార్మికుల కుటుంబాలకు 2లక్షల గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.నాయకులు గుమ్మడి కుమారస్వామి, ధర్మపురి, సదానందం, కాంపెల్లి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ- జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విజయభేరి



విద్యార్థులతో యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్.పవన్ సూర్య 220వ ర్యాంక్, బి.భవ్య 748, పల్లె బిందు 1,482, యూ.మోహన్ సాయి 2,347, బి.సాయిచరణ్ 4,652, ఆర్.అనన్యరెడ్డి 10,299, ఎం.ఈశ్వర్ నాయక్ 10,482, కె.మాధురి 10,712 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఎస్.పవన్ సూర్య 99.98, యూ.మోహన్ సాయి 99.10, పి.బిందు 99.08, డి.హారిక 98.11, కె.మాధురి 96.60, డి.వంశీకృష్ణ 95.38, ఆర్.అనన్యరెడ్డి 94.44, జి.రామక్రిష్ణరెడ్డి 91.88 శాతంసాధించారు. పరీక్షకు హాజరైన 60శాతం మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడంలో శ్రీచైతన్య మరో సంచలనం సృష్టించింది. విద్యార్థులను చైర్మన్ రమేశ్‌రెడ్డి ,కళాశాలల డీన్ జగన్ మోహన్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధక్రిష్ణ, ఏజీఎం. శ్రీనివాస్ అభినందించారు.

గుండెపోటుతో మహిళ మృతి

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన ఏడు మేకల శైలజ(35) అనే మహిళ విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం ప్రాంగణంలో శనివారం ఉదయం గుడెపోటుతో మృతి చెందింది. శైలజ దుర్గమ్మ ఆలయంలో సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందింది. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శైలజ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల మల్లేశం(47)అనే గీతకార్మికుడు తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి గాయాలపాలయ్యాడు. తోటి గీతా కార్మికుల వివరాల ప్రకారం.. మల్లేశం రోజు వారి క్రమంలో తాటిచెట్టు ఎక్కి కల్లుగీసి కిందకు దిగుతున్న క్రమంలో మోకు జారి చెట్టుపైనుంచి పడటంతో ఎడమ చేయి విరిగింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

నేడు ఆర్‌డీసీ సెట్

సుల్తానాబాద్: ఈనెల 30న మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఎంట్రెన్స్ టెస్ట్ ఉందని ఆర్‌సీఓ గౌతమ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను గుర్తించామని, గంట ముందు కేంద్రం వద్దకు విద్యార్థులు చేరుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.